క్లుప్తంగా

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంసీఆర్‌పీలు

బలిజిపేట: పంచగవ్య ద్రావణం తయారీపై స్థానిక రైతులకు ఎంసీఆర్‌పీలు లక్ష్మి, తిరుపతి రావు శుక్రవారం అవగాహన కల్పించారు. 200 లీటర్ల ద్రావణం తయారీ చేశారు. దీని వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. పండ్ల తోటలు, కాయగూర తోటల్లో దీని వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు..



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

బలిజిపేట: చెడు వ్యసనాలకు ఎవరూ బానిస కావొద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సింహాచలం అన్నారు. బలిజిపేటలో మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడిన వారు జీవితాన్ని చేజేతులా పాడు చేసుకున్న వారవుతారని పేర్కొన్నారు. వారిపై ఆధారపడి జీవించే కుటుంబం నడిరోడ్డున పడుతుందన్నారు. ఇటువంటివి చట్టరీత్యా నేరాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగుల జిల్లా సమన్వయకర్త రామగోపాల్

సీతానగరం: సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ఉద్యోగుల సమస్యలుంటే పరిష్కరిస్తామని సచివాలయ ఉద్యోగులు జిల్లా సమన్వయకర్త బి.రామగోపాల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అధ్యక్షతన సచివాలయ ఉద్యోగులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు విధుల నిర్వహణ, ఎదుర్కొంటున్న సమస్యలు, విధుల్లో సమయపాలనపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

'కూటమి' హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మన్మథరావు

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వలంటీర్లకు గత రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వలంటీర్లకు రూ.10వేలు వేతనం చేస్తామన్న కూటమి నేతలు నేడు మాట తప్పారన్నారు. వెంటనే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో జి.వెంకటరమణ, వి.ఇందిర, బంకుర సూరిబాబు, గౌర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలి



అభ్యర్థులకు సూచనలిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపోలో ఫార్మసీ, హెటిరో కంపెనీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించామన్నారు. ఈ జాబ్ మేళాకు 47 మంది అభ్యర్థులు హాజరుకాగా 17 మంది ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

• త్వరితగతిన మినీ గోకులాల నిర్మాణం



రైతులకు మంజూరైన మినీ గోకులాలను త్వరగా నిర్మించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్రరావు సూచించారు. బలిజిపేట మండలం సుబద్ర, బర్లి, పెదపెంకి గ్రామాల్లో జరుగుతున్న మినీ గోకులాల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్మాణాల్లో ఎటువంటి జాప్యం వహించరాదన్నారు. ఏపీఓ కేశవరావు, క్షేత్ర స్థాయి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. – బలిజిపేట

• విక్రయాలకు ధాన్యం సిద్ధం



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు తెరవడమే ఆలస్యం రైతులు ధాన్యం విక్రయాలు చేసేందుకు సిద్ధమయ్యారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి చేను కోతలు దాదాపు పూర్తి కావస్తున్నాయి. కళ్లాల్లోనే రైతులు ధాన్యాన్ని ఎగురబెట్టి బస్తాలకు ఎత్తారు. కేంద్రాలు తెరిస్తే విక్రయించేందుకు సిద్ధం చేశారు. వీటి విక్రయాలు పూర్తయితే కళ్లాల్లో కావలా తప్పుతుందని రైతులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా ఇంకా చర్యలు తీసుకోవడం లేదు. – సీతానగరం

• సాగులో మెలకువలపై శిక్షణ



రైతులు సాగులో మెలకువలు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని డీఆర్‌సీ సహాయ సంచాలకులు ఆర్.శ్రీనివాసరావు అన్నారు. సీతానగరం మండలం అంటిపేట గ్రామంలో ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో అపరాల సాగులో మెలకువలపై రైతు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న డీఆర్‌సీ సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ సహాయ సంచాలకులు భారతి రైతులకు సాగులో మెలకువలను వివరించారు. అపరాల్లో ఎక్కువగా వచ్చే బూడిద తెగులు నివారణకు గంజి ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. – సీతానగరం

అక్కడివారు.. ఇక్కడికి వచ్చి...



పార్వతీపురం పట్టణంలో శీతాకాల దుస్తుల విక్రయాలు

ఎక్కడి నుంచో సీజన్ వారీగా ఏటా పార్వతీపురం వస్తూ కొద్ది నెలలు జీవనం సాగించి తిరిగి తమ ప్రాంతానికి వెళ్లిపోతుంటారు వారంతా.. శీతాకాలం వచ్చిందంటే చాలు ఏటా వస్తూ...తమ బతుకు తెరువు కోసం చిరు వ్యాపారాలు చేస్తూ.. తమ జీవనంలో ఈ ప్రాంతాన్ని కూడా భాగస్వామ్యం చేసుకుంటున్నారు. వారే మధ్యప్రదేశ్ వాసులు.

- మధ్యప్రదేశ్ నుంచి పార్వతీపురానికి..
- జోరుగా శీతాకాల దుస్తుల విక్రయాలు
- చిరు వ్యాపారాలతోనే జీవనం

పార్వతీపురం టౌన్:

కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు. బతుకు తెరువు కోసం వందల మైళ్ల దాటి, కుటుంబాలను వదలి ఈ ప్రాంతానికి వస్తున్నారు మహరాష్ట్రకు చెందిన చిరు వ్యాపారులు. ఇతరులపై ఆధారపడకుండా తమ వద్ద ఉన్న కొద్ది డబ్బుతోనే చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము నివసించే ప్రాంతాల్లో పని లేక ఆత్మవిశ్వాసంతో ఊరు కాని ఊరు వచ్చి చిరు వ్యాపారాలు సాగిస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు చిరు వ్యాపారులు పార్వతీపురం పట్టణానికి వచ్చి చిన్న టెంట్లు వేసుకుని రగ్గులు, స్వెట్టర్లు వంటి శీతాకాల దుస్తులు విక్రయిస్తున్నారు. ప్రతి సీజన్‌కు వారు ఇక్కడికి వచ్చి వ్యాపారం చేసుకుని సీజన్ ముగిసిన వెంటనే వారి ఊరికి వెళ్లిపోతుంటారు. తమ గ్రామాల్లో ఏడాది పొడవునా ఉపాధి సరిగా లేకపోవడంతోనే తాము వలస వచ్చి ఇక్కడ చిరు వ్యాపారాలు సాగిస్తున్నామని వారు చెబుతున్నారు.

ప్రతీ సీజన్‌లో వస్తాం..



ప్రతీ సీజన్‌లో వ్యాపారం నిమిత్తం పార్వతీపురం వస్తాం. ఈ సీజన్ తరువాత మా ప్రాంతానికి వెళ్లిపోతాం. మా గ్రామంలో ఉపాధి లేక ఇక్కడికి వచ్చి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. వ్యాపారంలో వచ్చే ఆదాయంతో పెట్టుబడి ఖర్చులు పోగా మిగిలే సొమ్ముతో సరి పెట్టుకోవాల్సి వస్తుంది. సీజన్ బట్టీట్ ఆదాయం ఉంటుంది. మిగిలిన కాలం మా సొంతూర్లలోనే చేతనైన పనులు చేస్తుంటాం.

– బంటి దామ, ఆగర్ ప్రాంతం, మధ్యప్రదేశ్

ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాం..



మధ్యప్రదేశ్ నుంచి సుమారు 6 సంవత్సరాలుగా పార్వతీపురం పట్టణానికి శీతాకాలంలో వచ్చి వ్యాపారం చేస్తున్నాం. కుటుంబ పోషణకు ఇక్కడకు రావాల్సి వస్తుంది. ప్రతీ సీజన్‌కు కొత్త రకాల సరుకులు తీసుకువస్తుంటాం. ఎక్కువ కాలం సీజనల్ వ్యాపారాలు చేసుకుంటూ ఇతర ప్రాంతంలోనే నివసించాల్సి వస్తుంది. ఒక్కోసారి వ్యాపారాలు జరగకపోయినా తప్పక ఈ వ్యాపారాలు చేసుకుంటున్నాం.

– జగదీష్ కరణ్, ఆగర్ ప్రాంతం, మధ్యప్రదేశ్

తమకు ఉన్న కొద్ది మొత్తంతో సరుకు తీసుకొస్తామని, డిమాండ్‌ను బట్టి అదనపు సరుకు కోసం ఇక్కడి నుంచి ఆర్డర్లు పెడతామని పేర్కొంటున్నారు. తమ లాగే తమ రాష్ట్రం నుంచి చాలా మంది వేర్వేరు రాష్ట్రాలకు ఈ కాలంలో చిరు వ్యాపారాలు చేసేందుకు తరలివెళ్తారని, తాము ఇక్కడకు వచ్చామని తెలిపారు. ఈ ప్రాంతీయుల అభిమానంతో తమ వ్యాపారాలు బాగానే సాగుతున్నాయని, కొద్ది నెలలు ఇక్కడే జీవనం సాగిస్తామని పేర్కొన్నారు. టెంట్లు వేసుకుని రెయిన్ కోట్లు, మంకీ క్యాప్లు, స్కార్ఫులు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. సీజను ముందే వచ్చి నాలుగు నుంచి ఆరు నెలల పాటు వ్యాపారాలు సాగిస్తుంటారు.

మహిళల రక్షణలో కూటమి ప్రభుత్వం విఫలం



పట్టణంలో ర్యాలీ నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

పార్వతీపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు అన్నారు. విశాఖ లా విద్యార్థికి న్యాయం చేయాలని శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రోజురోజుకు మహిళలకు లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, మద్యం, గంజాయి డ్రగ్స్, మాదక ద్రవ్యాలు నియంత్రించకపోవడం వల్లే ఇవన్నీ జరుగుతున్నాయన్నారు. ఇంత జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా సనాతన ధర్మం, లడ్డూ రాజకీయాలు తీసుకొస్తుందన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో మాత్రం ముందుకు రావడం లేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి లా విద్యార్థినిపై లైంగిక దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అశ్లీల చిత్రాల వెబ్‌సైట్లను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అఖిల్, జిల్లా కమిటీ సభ్యులు శివ, పార్వతిపురం టౌన్ కార్యదర్శి డేవిడ్, సభ్యులు సంజీవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విధానంపై ఆశాలకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి హేమాక్షి

పార్వతీపురం టౌన్: ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ, సాధారణ వ్యాధులు, మధుమేహం నియంత్రణపై ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నట్టు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఆయుష్ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శిక్షణకు సంబంధించిన షెడ్యూల్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖకు అందజేస్తామన్నారు. ఈ మేరకు బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఎస్.ఎమ్.కె. తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు శుక్రవారం ఆయుష్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాచీన ఆయుర్వేద వైద్య విధానం ద్వారా అనేక దీర్ఘకాలిక రుగ్మతలను తగ్గించవచ్చని, ఇందుకు అనేక ఆయుర్వేద ఔషధాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత మానవ జీవన విధానంలో మధుమేహం ప్రధాన సమస్యగా ఉందని ఇటువంటి దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేద వైద్యం ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. శిక్షణకు సంబంధించి ఆయుష్ శాఖ పంపిణీ చేసిన పుస్తకాలు, బ్రోచర్లను వైద్యాధికారి ద్వారా ఆశాలకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీరాములు నాయుడు, నాగమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంబర రోడ్డును పరిశీలించిన జిల్లా రవాణా శాఖాధికారి



మామిడిపల్లి గ్రామంలో శంబర రోడ్డును పరిశీస్తున్న జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామం శంబర రోడ్డు కూడలి వద్ద గోతుల రహదారిని జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్ శుక్రవారం పరిశీలించారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా ఆయన మామిడిపల్లి గ్రామంలో పర్యటించారు. సచివాలయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన సైకిల్ షెడ్ మంజూరుకు సిఫారసు చేయాలని ఉపాధ్యాయులు ఆయనను కోరారు. తాగునీటిని శుద్ధి చేసే యంత్రం పాడైందని, బాగు చేయించాలని కోరారు. సాలూరు మోటారు ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ గోవింద్

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని పట్టణ ఎస్‌ఐ ఎం.గోవింద్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పం కార్యక్రమం ఉద్దేశం తెలిపారు. సదస్సులో హెచ్‌సీ కె.కృష్ణమూర్తి, ఎం.నిర్మల, ఇ.ప్రభాకర రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ జాబ్ కార్డులు

మక్కువ: అర్హులందరికీ జాబ్ కార్డులు అందించడం జరుగుతుందని ఉపాధి హామీ ఏపీఓ ఎస్.ఈశ్వరమ్మ అన్నారు. మండలంలోని కన్నంపేటలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. జాబ్ కార్డులో పేరు ఉండి చనిపోయిన వారి పేర్లు తొలగించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాల నిండిన వారికి జాబ్ కార్డులో యాడ్ చేయడం జరుగుతుందన్నారు. పని అడిగిన ప్రతి ఒక్కరికి సత్వరమే జాబ్ కార్డు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ప్రతిభ చాటాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ- 1సామల

బలిజిపేట: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 29న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్టు, ఇందులో విద్యార్థులు ప్రతిభ చాటాలని ఎంఈఓ 1 సామల సింహాచలం అన్నారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. కలెక్టర్ ప్రత్యేకంగా మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. దీని కోసం జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలలకు ప్రత్యేకాధికారులను నియమించి పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



రహదారి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

మక్కువ: మండలంలో శంబర గ్రామంలో జరుగుతున్న రహదారి పనులను ఎంపీడీఓ స్వరూపరాణి శుక్రవారం పరిశీలించారు. పోలమాంబ అమ్మవారి చదురు గుడి, వనంగుడి సమీపంలో రెండు కోట్ల 40 లక్షల రూపాయల అంచనాతో ఉపాధి హామీ పథకం నిధుల మంజూరు కాగా, రహదారుల నిర్మాణ పనులను జరిపిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ సూచించారు. ఈ సందర్భంగా ఆమె శంబర సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. శంబర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అందుతుందా? లేదా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వివిధ శాఖల సిబ్బంది ఉన్నారు.

జాగ్రత్తలతోనే జీవాల సంరక్షణ



ఆరుబయట సంచరిస్తున్న జీవాలు

బలిజిపేట: శీతాకాలంలో జీవాలకు సంక్రమించే వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు అవసరం. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా జీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశాలు ఉంటాయి. ఉదయం, రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో గొర్రెలు, మేకలు, వాటి పిల్లలకు వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు పాటించడం అవసరం.

- చలిని తట్టుకునే శక్తి వచ్చే వరకూ తల్లి గొర్రె నుంచి పాలు అందేలా పిల్లలను చూసుకోవాలి. దీని వలన గొర్రె పిల్లల్లో ఎదుగుదల, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పిల్లలకు చలిగాలులు తగలకుండా, శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- గొర్రె, మేక పిల్లలు మట్టిని నాకకుండా చూసుకోవాలి. మట్టి నాకడం వలన పారుడు రోగం లాంటి వ్యాధులు సోకుతాయి. ఖనిజ లవణ మిశ్రమం(మినరల్ మిక్చర్) కలిగిన ఇటుకలను పిల్లలు గూళ్లలో వేలాడదీయాలి. పిల్లలను ఎక్కువ సంఖ్యలో ఉంచితే ఖాళీ ప్రదేశం లేకపోవడంతో వాటిలో ఒత్తిడి నెలకొంటుంది. విశాలంగా, శుభ్రంగా గాలి, వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. రాత్రిళ్లు వెచ్చదనం ఉండేలా లైట్లను లేదా అడ్డుతెరలు ఏర్పాటు చేయాలి.
- జీవాలు ఉండే ప్రాంతాల్లో భూమిలో తేమశాతం లేకుండా ఉండాలి. పొడి వాతావరణం, ఎత్తైన ప్రదేశాలను ఎంచుకోవాలి. తేమ వలన పరాన్న జీవులు, సూక్ష్మజీవుల బెడద ఎక్కువై వ్యాధులు ప్రబలి జీవాల మరణాలు ఎక్కువగా ఉంటాయి.
- చలికాలంలో దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. గోమార్ల నివారణ చర్యలు చేపట్టాలి. చిన్న పిల్లలను బయట ప్రదేశాల్లో ఉంచితే దోమతెరలు వాడాలి. చిన్నపాటి షెడ్లలో రక్షణ ఏర్పాటు చేసి పెంచడం ఉత్తమం.
- జబ్బులు వ్యాపిస్తే మందలోని పిల్లలను వేరు చేయాలి. పిల్లలన్నింటికీ ఎంసీ ఈటీ టీకాలను వేయించాలి. యాంటీబయోటిక్స్, బీ-కాంప్లెక్స్, లివర్ టానిక్‌లు, ఈస్ట్ కల్చర్‌లు, జీర్ణక్రియ మందులు, ఐరన్, కాల్షియం తదితర మందులు పశువైద్యుని సూచనల మేరకు వినియోగించాలి.
- కాలిగిట్టల మధ్య చీము చేరి చెడు వాసన రావడం, కుంటడం లాంటి లక్షణాలు ఉంటే కాలి పుండ్ల వ్యాధిగా గుర్తించి బురద ప్రాంతాల్లో మేపకుండా చూడాలి. నట్టల మందు తాపించాలి. కాలిపుండ్లు బాగా కడిగి పసుపు లేదా ఆయింట్‌మెంట్ రాసి మట్టి తగలకుండా రెండు రోజులు యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది.
- పారుడు, చిటుకు వ్యాధులు వంటివి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలి.

జబ్బు చేస్తే వైద్యులను సంప్రదించాలి

జీవాలకు చలి కాలంలో ఎటువంటి సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలి. వారి సూచనల మేరకే వాటికి మందులు వినియోగించాలి. మందలకు తీసుకువెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

పాఠశాలల పని గంటల పెంపు సరికాదు

బలిజిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పని గంటల పెంపు నిర్ణయం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధనంజయరావు పేర్కొన్నారు. బలిజిపేటలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులకు పాఠశాలల తరగతులు నిర్వహించడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు.

ఉన్నత పాఠశాలలకు నాలుగైదు కిలో మీటర్ల దూరం నుంచి విద్యార్థులు వస్తుంటారని ఈ పని వేళలు వారిని ఇబ్బందులకు గురి చేస్తాయన్నారు. కాలి నడకన పాఠశాలలకు వచ్చే దూర ప్రాంత విద్యార్థులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.